క్లుప్తంగా

బాలోత్సవ్‌లో పర్యావరణంపై అవగాహన

సంతనూతలపాడు: స్థానిక సుందరయ్య భవన్లో ప్రకాశం బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శనివారం 9వ రోజు పర్యావరణం –దాని ప్రభావం అనే అంశంపై పిల్లలకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు పాల్గొని పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. పర్యావరణంపై విద్యార్థి దశ నుంచే పిల్లలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు ప్రజలందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. చెట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలానికి సంబంధించి మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్లో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. మండలంలో 17 యూనిట్లకుగానూ 24 లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. సబ్సిడీతో కూడిన రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతనూతలపాడులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు సంబంధించి నాలుగు యూనిట్లు, ఐదు లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. కెనరా బ్యాంకుకు 6 యూనిట్లకు 6 లక్షల 50 వేల రూపాయలు, మైనంపాడు కెనరా బ్యాంకుకు ఐదు యూనిట్లకు 10 లక్షల 50 వేల రూపాయలు, మండలంలోని చిలకపాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రెండు యూనిట్లకు 2 లక్షల రూపాయల మేరకు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు.

ప్రజా కవి కలేకూరికి ఘన నివాళి


కలేకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రజా కవి కలేకూరి ప్రసాద్ వర్ధంతి సందర్భంగా శనివారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో మాల ఉద్యోగుల సంఘం, మాల జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలేకూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.అశోక్‌బాబు మాట్లాడుతూ కలేకూరి తల్లిదండ్రులు ఉద్యోగస్తులైనప్పటికీ తాను ఉద్యమాల్లోకి వచ్చి సమాజంలోని అసమానతలపై చలించి తన ధిక్కార భావాన్ని కలం ద్వారా ప్రజల హృదయాలను తాకేలా చేశారని కొనియాడారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై, అగత్యాలపై కలేకూరి రాసిన కర్మభూమిలో పూసిన ఓ పువ్వా.. అనే పాట ప్రజల మనసులను హత్తుకుందన్నారు. కార్యక్రమంలో మాల జేఏసీ అధ్యక్షుడు కె.ఏడుకొండలు, లక్ష్మీనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎంపీడీవో


మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న సురేష్‌బాబు

సంతనూతలపాడు: ప్రత్యేక పారిశుద్య కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు రెండో సచివాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శనివారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు పరిశీలించారు. వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఆరోగ్య కేంద్రం వైద్యుడు నాగరాజు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంగనాయకస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

రాచర్ల:

నల్లమల అటవీ ప్రాంతం మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఆలయం సమీపంలోని నీటిగుండంలో స్నానాలు ఆచరించి, క్యూలో స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కృష్ణదేవరాయల కాపు బలిజ, గోపాలకృష్ణ యాదవ, కాశినాయన, యోగి వేమన రెడ్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎండల నుంచి రక్షణ పొందాలి


వైద్యారోగ్యశాఖ కరపత్రాలను ప్రదర్శిస్తున్న డీఆర్‌ఓ ఓబులేసు, మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, ఇతర అధికారులు, నాయకులు


ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేస్తున్న వైద్యసిబ్బంది

● డీఆర్‌ఓ ఓబులేసు

మద్దిపాడు: ప్రజలు ఎండల నుంచి రక్షణ పొందాలని డీఆర్‌ఓ ఓబులేసు సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మద్దిపాడు మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన బీట్ ద హీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉంటున్న తరుణంలో ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ బయటకు రాకుండా ఉండటం మేలని అన్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ పెట్టుకుని ఎండ తీవ్రత తగలకుండా చూసుకోవాలన్నారు. మొహాన్ని కూడా రుమాలు, తువాలు వంటి వాటితో కవర్ చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు కూడా ఉదయం 9 గంటల్లోపు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాలలో షేడ్‌నెట్‌లు ఉపయోగించాలని తెలిపారు. వేసవిలో ఎక్కువగా మజ్జిగ తాగాలని, వైద్యశాఖ అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఎండల బారిన పడినవారు, వడదెబ్బ తగిలిన వారు సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి చికిత్స పొందాలని తెలిపారు.

అనంతరం ఎండల నుంచి కాపాడుకోవడానికి ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీ సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ నారాయణరావు, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, గ్రామ సర్పంచ్ శిల్పసౌందర్య, పలువురు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

సంతనూతలపాడు: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సంతనూతలపాడులో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో డి.సురేష్ బాబు, తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మితో కూడిన బృందం పరిసరాల పరిశుభ్రతపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్‌కుమార్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. రహదారులపై చెత్త వేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు.

మద్దులూరులో...

సంతనూతలపాడు మండలం మద్దులూరు గ్రామంలో శనివారం కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించారు. వేములపాడు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 35 మంది రోగులకు చికిత్స చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మద్దులూరు గ్రామంలోని సైడు కాలువల్లో పూడికతీసి మట్టి దిబ్బలు తొలగించారు. బస్టాండ్ సెంటర్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మద్దులూరు సర్పంచ్ బి.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ నాగమణి...

స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, ఎంపీడీవో డి.సురేష్ బాబు, తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్‌కుమార్, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రతోనే పరిసరాల పరిశుభ్రత...

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రగా మారాలంటే స్వచ్ఛాంధ్రతోనే సాధ్యమని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఈదుమూడి గ్రామంలో నిర్వహించిన బీట్ ద హీట్ కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి వీధులను శుభ్రం చేశారు. ఎంపీడీవో మహాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో ఎండతీవ్రతకు జాగ్రత్తలు పాటించాలి

చీమకుర్తి రూరల్: వేసవిలో ఎండతీవ్రత అధికంగా ఉండటం వలన ప్రజలు వడదెబ్బబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ అజిత సూచించారు. శనివారం పడమటినాయుడిపాలెం గ్రామంలో సచివాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో బీట్ ద హీట్ అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అజిత మాట్లాడుతూ వేసవిలో వేడి తగ్గించడానికి, ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వేసవికాలం దృష్ట్యా పాదచారుల దాహార్తి తీర్చడానికి మాజీ సర్పంచ్ కె.కరుణాకర్‌రెడ్డి సచివాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకర్, ఇ.ఏడుకొండలు, కె.సుబ్బారెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఈదుమూడి గ్రామంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


సచివాలయ ప్రాంగణంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ అజిత, గ్రామ నాయకులు

ఉపాధి హామీ కూలీల కనీస వేతనం పెంచాలి

సంతనూతలపాడు: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని చంద్రపాలెం గ్రామ పరిధిలో శనివారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘ నేతలు వెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు వారి సమస్యలు వివరించారు. కనీస వేతనం రూ.307గా ప్రభుత్వం నిర్ణయించిందని, అది ఎవరికీ రావడం లేదని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనిచేస్తున్నామని, కొన్నిసార్లు చేతులు బొబ్బలెక్కేలా పనిచేసినా రూ.220, రూ.230కి మించి వేతనం రావట్లేదని తెలిపారు. గతంలో సమ్మర్ అలవెన్స్, మజ్జిగ, మంచినీళ్లకు, పనిముట్లకు పరిహారం ఇచ్చేవారని, నేడు అవి పూర్తిగా రద్దు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ కరువు కాలంలో కష్టజీవుల కడుపు నింపేందుకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టంపై పాలకులు నిర్దయగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.400 అయినా ఉండాలని, ఏడాదికి కనీసం 150 రోజులైనా పని కల్పించాలని చెప్పిందన్నారు. దేశం ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలంటే ప్రజల కొనుగోలు శక్తి పెరగాలని, అందుకు మెరుగైన మార్గం ఉపాధి హామీకి ఏడాదికి రెండు లక్షల 50 వేల కోట్ల రూపాయలు కేటాయించడమేనని అన్నారు. సంపన్నులకు, కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల రాయితీలిస్తూ వారు కోరిన రుణాలు రద్దు చేస్తున్న ప్రభుత్వం.. కష్టజీవుల జీవన ప్రమాణాల మెరుగుదలకు, పేదరిక నిర్మూలనకు నిధుల కేటాయింపులో కనికరం లేకుండా వ్యవహరిస్తోందని అన్నారు. వేతనం పెంపు కోసం, చట్టంలో చెప్పిన సౌకర్యాల అమలు కోసం ఉపాధి హామీ కూలీలు ఐక్యంగా పోరాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయని, ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పనిచేస్తున్న క్రమంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతే వారికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకుడు దారా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

అద్దె భారమని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను తరలిస్తారా..?

ఒంగోలు టౌన్: అద్దె భారం సాకుతో ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఇడుపులపాయకు తరలించాలని ప్రయత్నించడం సమంజసం కాదని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ అన్నారు. శనివారం స్థానిక రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌ను సందర్శించి ఆయన మాట్లాడారు. ఒంగోలు క్యాంపస్ విద్యార్థులకు సొంత భవనాలు నిర్మించాలన్న ఆలోచన చేయకుండా క్యాంపస్ తరలించడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు బెంబేలెత్తుతున్నారన్నారు. ఇడుపులపాయలోని ఆర్కేవ్యాలీలో ఒంగోలు క్యాంపస్ విద్యార్థులను చిన్నచూపు చూస్తున్న నేపథ్యంలో తరచూ గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒంగోలులోనే ట్రిపుల్ ఐటీకి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఒంగోలుతో పాటు శ్రీకాకుళంకు ట్రిపుల్ ఐటీ కాలేజీలను కేటాయించగా, ఇప్పటికే శ్రీకాకుళంలో సొంత భవనాల నిర్మాణం జరిగిందన్నారు. ఒంగోలుకు మాత్రం గత పదేళ్లుగా సొంత భవనం నిర్మించకపోవడం వల్ల విద్యార్థులు అవస్థపడుతున్నారని తెలిపారు.



రావ్ అండ్ నాయుడు క్యాంపస్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకుడు వినోద్

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మద్దిపాడు: మండలంలోని మల్లవరంలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిసాయి. చివరిరోజు ఉదయం చక్రస్నానం, రాత్రి 8 గంటలకు ఊంజల్ సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా పది రోజుల పాటు ఆగమ ప్రవర దివి వెంకట శేషాచార్యులు వేద మంత్రాలతో విశేష పూజలు నిర్వహించారు. చివరిరోజు ఉదయం మల్లవరం గ్రామానికి చెందిన వరహాల చౌదరి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించగా, సాయంత్రం నాగినేని భారతి, వారి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, నారాయణం రాజశేఖరాచార్యులు, కార్యనిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు.


శ్రీవారిని చక్రస్నానానికి తీసుకెళ్తున్న అర్చకులతో ఉభయదాతలు

రక్తపోటుపై అవగాహన అవసరం


ఒంగోలు టౌన్: రక్తపోటు ఉందన్న విషయం తెలుసుకునే లోపే శరీరంలోని ప్రధాన అవయవాలు దెబ్బతింటున్నాయని, తరుచూ రక్తపోటు పరీక్ష చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ రోజురోజుకు బీపీ బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిపోతుందని చెప్పారు. ఇటీవల కాలంలో చిన్న వయసులోనే బీపీ బారిన పడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందన్నారు. జీవన శైలిలో మార్పు, అధిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు రక్తపోటుకు కారణాలని చెప్పారు. ప్రజలు బీపీ పట్ల అవగాహన కల్పించుకోవాలని సూచించారు. రక్తపోటును గుర్తించిన వారిని వెంటనే ప్రాథమిక వైద్య చికిత్స అందిస్తామన్నారు. సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన గుండె జబ్బుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీపీ ఉన్న ప్రతి ఒక్కరూ కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో 104 ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ భగీరథి, అకౌంటెంట్ రాజేష్, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఘనంగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం

నాగులుప్పలపాడు: మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి 16వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులైన శిష్ఠా పాండురంగయ్య, శ్రీనివాసరావు, తదితరులు దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కళ్యాణం జరిపించారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. పీటలపై కూర్చున్న గోగినేని సుబ్బారావు దంపతులు, పిన్నింటి నాగార్జున దంపతులు, నార్నె అనిల్ కుమార్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలతో ఊరేగింపుగా దేవస్థానం వద్దకు చేరుకున్నారు. ఒమ్మెవరం గ్రామస్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించారు. దేవస్థానం కమిటీ సభ్యులు భక్తులకు అన్ని వసతులు కల్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు.


స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

70 మందికి వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర–స్వర్ణాంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో 70 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పేద ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బీవీఎస్ఆర్ కాలేజీలో గెట్ టు గెదర్

చీమకుర్తి రూరల్: స్థానిక బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో 2010–14 బ్యాచ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులు శనివారం గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ ప్రతాప్ కుమార్, ఏవో కోటిరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులతో బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా ర్యాలీ

చీమకుర్తి రూరల్: ఆపరేషన్ సింధూర్ విజయోత్సవంలో భాగంగా చీమకుర్తిలో శనివారం జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే విజయ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొని స్థానిక నెహ్రూనగర్ నుంచి బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా వీరమరణం చెందిన ఆర్మీజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దారా సాంబయ్య, బొడ్డు శంకర్, అపర్ణ, కె.రమణయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత


కారుణ్య నియామకాలను అందజేస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఆర్టీసీలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబసభ్యుల్లో ఆరుగురికి కారుణ్య నియామకాలను ఎస్పీ ఏఆర్ దామోదర్ అందజేశారు. ఆరుగురికి మహిళా పోలీసులుగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులుగా ఉద్యోగంపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచార సేకరణలో ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. మెరుగైన రీతిలో ప్రజలకు సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించుకోవాలని, పాఠశాలలు, కళాశాలలలోని విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రతా నియామకాలు గురించి తెలియజేయాలన్నారు. డీపీఓ ఏఓ రామ్మోహనరావు, యు. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన బల్లికురవ ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో పేరంటాలమ్మ–పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్లు 2354 అడుగుల దూరం లాగి మొదటిస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన గొటికె ధనేష్‌రెడ్డి ఎడ్లు 2351 అడుగులతో ద్వితీయ, మార్కాపురం మండలం బొడిచర్ల టి. నక్షత్రరెడ్డి ఎడ్లు 2063 అడుగులు, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం లక్కు నాగశివశంకర్ ఎడ్లు 1765 అడుగులతో, నంద్యాల జిల్లా పెసరవాయి కలాంబాష ఎడ్లు 1593 అడుగులు, బాపట్ల జిల్లా పీవీఎస్ఆర్ ఎడ్లు 1577, గిద్దలూరుకు చెందిన దుర్వాసుల అశ్విని ఎడ్లు 1352, బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారంకు చెందిన లక్కు మునీశ్వరయ్యా ఎడ్లు 500 అడుగులతో వరుస స్థానాలు సాధించాయి.